సాక్షి
గుంటూరు
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025




వైభవంగా కల్యాణం

నగరంపాలెం: బ్రాడీపేటలోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శనివారం శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు.



హరినామ జప యజ్ఞం

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో ఉన్న హరే కృష్ణ గోకుల క్షేత్రంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం సామూహిక హరి నామ జప యజ్ఞం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 546.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని చెప్పారు. ముగింపు రోజు సందర్భంగా ఉదయం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి తిరుమంజనం, అష్టోత్తర శతనామార్చన, వేదాశీర్వచనముతో కార్యక్రమాలు ఘనంగా ముగిశాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, వేదపండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డైక్ సెంటర్‌లో జడ్జి వై.గోపాలకృష్ణ పరిశీలన



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని (డైక్) శనివారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వై.గోపాలకృష్ణ సందర్శించారు. డైక్ సెంటర్‌లో పిల్లలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

హెడ్ పోస్టాఫీసులో సీపీఎంజీ తనిఖీ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) కె.ప్రకాష్ శనివారం స్థానిక కొత్తపేటలోని ప్రధాన పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.45 గంటల ప్రాంతంలో పోస్టాఫీసుకు చేరుకుని నేరుగా మెయిల్స్ విభాగానికి వెళ్లారు. అక్కడ మెయిల్స్, పార్శిళ్ల వివరాలను తెలుసుకున్నారు. అకౌంట్స్ విభాగాన్ని సందర్శించారు. జీవిత బీమా చాంబర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. నగదు బదిలీలు జరుగుతుండే కౌంటర్లకు వెళ్లారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ట్రెజరీ విభాగాన్ని తనిఖీ చేశారు. డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకరబాబు, పోస్ట్‌మాస్టర్ ఈ.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు వెంట ఉన్నారు.

సైబర్ భద్రతకు సవాళ్లపై సదస్సు



తాడికొండ: ఢిల్లీలోని నేషనల్ సైబర్ భద్రతా పరిశోధన మండలి, ఏఐసీటీఈ సహకారంతో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్ పేరిట సదస్సును శనివారం నిర్వహించారు. సైబర్ భద్రతా ఔత్సాహికులు, నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో సైబర్ బెదిరింపులు రోజుకో రూపంలో ఉంటున్నాయని తెలిపారు. న్యూఢిల్లీలోని ఎన్‌సీఎస్‌సీఆర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గౌరవ సలహాదారు షేక్ అహ్మద్ మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ అనేది వ్యక్తిగతమైనది కాదన్నారు. నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ ఖలీరాజ్ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ ధోరణులు, సాంకేతిక పురోగతిపై సూచనలు చేశారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.వి.కోటరెడ్డి మాట్లాడుతూ పలు విద్యా సంస్థల నుంచి 100 బృందాలు, 300 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు.

కేసినో వేట..
జీవితాలతో ఆట..!

గోవా అనగానే బీచ్‌లతోపాటు కేసినోలు గుర్తుకొస్తాయి. ఆ కేసినోలపై తెలుగు రాష్ట్రాల్లోని కొందరికి ఉన్న ఆకర్షణను అవకాశంగా చేసుకుని కొన్ని ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఈవెంట్ల పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఏజెంట్లను నియమించుకుని మరీ అమాయకులకు ఎర వేస్తున్నారు. గోవాతోపాటు శ్రీలంక, నేపాల్‌లలో కూడా దందా సాగుతోంది. రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించి వెళ్లేవారు.. ఆటలు ముగిశాక ఒట్టి చేతులతోనో, అప్పుల భారంతోనో, ఆస్తులు రాసేసో.. వెనక్కి రాక తప్పడం లేదు. ఇలా వెళ్లిన వందల మంది సర్వం పోగొట్టుకుని వస్తున్నారు.

- ఈవెంట్లకు వాట్సప్ ద్వారా ఆహ్వానాలు
- నిర్వాహకులు తెలుగు రాష్ట్రాలకు చెందినవారే
- ఈవెంట్లు ఉంటే విమానాలన్నీ ఫుల్
- ఒక్కో ట్రిప్‌కి రూ.లక్షన్నర నుంచి రూ. 2 లక్షలు హుష్
- ఒట్టి చేతులతో వస్తున్న వందల మంది బాధితులు

గోవా, శ్రీలంక, నేపాల్ కేంద్రంగా దందా



SUNDAY SPECIAL

సాక్షి ప్రతినిధి, గుంటూరు : మధ్య తరగతి, సంపన్నవర్గాలకు కేసినో ఈవెంట్లు నిర్వహించే ముఠాలు గాలం వేస్తున్నాయి. గోవాలోని కేసినోలతో చీకోటి ప్రవీణ్ తెరపైకి రాగా.. ఆయనను ఆదర్శంగా తీసుకుని మరికొందరు ఈ దందాలో అడుగుపెట్టారు. గోవాలో 13 ముక్కలాటపై నిషేధం ఉన్నా, అద్దెకు తీసుకున్న కేసినోలలో వీటిని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఎనిమిది మంది సిండికేట్‌గా ఏర్పడ్డారు. శ్రీనివాస రెడ్డి, ధన, రఫీ, వీరన్నగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజు, పరమేష్, తిరుపతిరెడ్డిలు తమ వాట్సప్ గ్రూపుల ద్వారా దందా నడుపుతున్నారు. ఏరియాలవారీగా సభ్యులను ఏర్పాటు చేసుకుని ఎరినైనా గోవా పంపితే కమీషన్ ఇస్తున్నారు. ప్రతి నెలలో ఇరవైకిపైగా ఇలాంటి ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు.

గోవాలోని బిగ్ బీ, క్యాడీలాక్ డైమండ్ తదితర కేసినోలను అద్దెకు తీసుకుంటున్నారు. నాలుగు రోజుల ఈవెంట్‌కు రూ.కోటి వరకు అద్దె చెల్లిస్తున్నారంటే వారి రాబడి స్థాయి ఎంతో తెలుసుకోవచ్చు.

డిపాజిట్ మొత్తాన్ని బట్టి ఆఫర్లు

వెళ్లేవారు కనీసం రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు వారికి కాయిన్లు అందిస్తారు. ఈ కాయిన్లతో కేసినోలో ఆడాల్సి ఉంటుంది. వీరికి రానుపోనూ ఉచితంగా విమాన టిక్కెట్లు, గోవాలో బస సదుపాయం, కట్టిన మొత్తాన్ని బట్టి ఫ్రీ మద్యం, వినోద కార్యక్రమాలు వంటి ఆఫర్లు ఉంటాయి. గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్‌ల నుంచి విమానాలలో గోవాకు తీసుకెళ్తున్నారు. ఈవెంట్లు ఉన్న రోజుల్లో ఇక్కడి నుంచి గోవా వెళ్లే విమానాలన్నీ రద్దీగా ఉంటున్నాయి. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో ఆర్గనైజర్, అతడికి ఫోన్ నెంబర్ కేటాయిస్తున్నారు. అందర్-బాహర్, బక్కారత్, రౌలెట్టీ, బ్లాక్‌జాక్, జండూ, తీన్‌పత్తీ, రమ్మీ/సిండికేట్‌తో పాటు 13 ముక్కల ఆట ఆడిస్తున్నారు.



అప్పులిచ్చి.. ఆస్తులు కొట్టేసి..

గెలిచినా ఏదో విధంగా డబ్బులు గుంజి పంపుతున్నారు. డబ్బులు పోతే అక్కడే వీరికి అప్పులు ఇచ్చి మరీ లాగేస్తున్నారు. తర్వాత పొలాలు, స్థలాలు వంటి స్థిరాస్తులు కూడా రాయించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇలా ఈవెంట్లకు వెళ్తున్న వారి సంఖ్య వందల్లో ఉంటోంది. గోవా కేసినోలో ఆడితే జీఎస్‌టీతో కలిపి అక్కడి నిర్వాహకులకు చెల్లించాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఈవెంట్లు చేస్తున్న వారు అక్కడ తమ సొంత స్వైపింగ్ మిషన్లు పెడుతున్నారు. జీఎస్‌టీ కూడా చెల్లించకుండానే ఈవెంట్లు చేస్తున్నా ప్రభుత్వాలు, నిఘా వర్గాలు పట్టించుకోవడం లేదు. దీంతో దందా యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ ముఠాల చేతిలో చిక్కిన వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి.



శాసన మండలిలో ప్రజా గళం వినిపిస్తా


ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజా సమస్యలను అజెండాగా చేసుకుని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శాసనమండలి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున మరోసారి పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు 10వ తేదీన నామినేషన్ వేస్తున్న సందర్భంగా శనివారం గుంటూరులోని హోటల్‌లో తన మద్దతుదారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 2007లో శాసనమండలి పునరుద్ధరించిన నాటి నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, వివిధ వర్గాల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తున్నారన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మంచి నిర్ణయాలు తీసుకుంటే సమర్థిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే వ్యతిరేకించామన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఎమ్మెల్సీలు సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయగలరా? అని ప్రశ్నించారు. పోటీలో ఎవరున్నా భయపడే ప్రసక్తి లేదని, కూటమి పాలన చూసిన ప్రజలు సరైన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి పీడీఎఫ్‌ను గెలిపించాలని లక్ష్మణరావు కోరారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంత రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖర రావు, ఎం.కళాధర్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'మూర్ఛ' బాధలు మర్చిపోండిక!

- ఆధునిక వైద్య సేవలతో పూర్తిగా నయం
- వ్యాధి బారిన పడుతున్న వారిలో యువత
- రేపు ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డే



గుంటూరు మెడికల్ : ఎపిలెప్సీ (ఫిట్స్)కి ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది. తగిన అవగాహన లేక ఆ వైద్యసేవలను పలువురు వినియోగించుకోవడం లేదు. ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు 2005 నుంచి ఫిబ్రవరి రెండో సోమవారం నాడు ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

మెదడులోని న్యూరాన్‌లకు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ లేదా మూర్ఛ అంటారు. ఇది వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. కొంత మందికి నాలుక కొరుక్కోవడం, నోటి నుండి నురగ కారడం గమనించవచ్చు. ఫిట్స్ ఎక్కువ సమయం ఉండే మనిషి దేహం నీలంరంగుగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకోవచ్చు.

కారణాలివీ...

మెదడులో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, మెదడులో రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల ఫిట్స్‌కు అవకాశం ఉంది. వయస్సుతో సంబంధం లేదు. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో, కొందరికి ప్రసవ సమయంలో కొన్ని రకాల చికిత్స విధానాలు పాటించకపోవడం వల్ల కూడా మూర్ఛ రావచ్చు. టీబీ, హెచ్‌ఐవీ, మెదడువాపు జబ్బుల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల ఫిట్స్ కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

గుంటూరులో వ్యాధి బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం మూర్ఛ వ్యాధి బాధితుల కోసం ప్రత్యేక ఓపీ ఉంది. వారానికి 300 మంది వస్తున్నారు. జిల్లాలో సుమారు 50 న్యూరాలజీ క్లినిక్‌లు, ఫిజీషియన్ల వద్ద రోజూ 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో 20 శాతం మంది యువకులే ఉండటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు అవసరం

మూర్ఛకు గురైన వ్యక్తిని నేలపై పడిపోకుండా పట్టుకోవాలి. వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి తలను దెబ్బతగలకుండా కాపాడాలి. బెల్టు, మెడకున్న టై వంటివి, బిగుతుగా ఉన్న దుస్తులను వదులుగా చేయాలి. ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి. మూర్ఛ తగ్గాక శ్వాస ఆడటానికి వీలుగా వ్యక్తిని ఒత్తికిల్లి పడుకునేలా శరీరాన్ని తిప్పి, నోటిలో నుంచి వచ్చే నురుగను తుడిచివేయాలి. వ్యక్తితో ప్రేమగా మాట్లాడుతూ అతడు పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకూ అక్కడే ఉండాలి.

పెళ్లి కూడా చేసుకోవచ్చు



మూర్ఛ వ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు. నయం చేసే ఆధునిక వైద్య సౌకర్యాలు నేడు అందుబాటులో ఉన్నాయి. పిల్లలు సాధారణంగానే పుడతారు. చిన్నారుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదించాలి. తద్వారా వెంటనే వ్యాధి నుంచి కోలుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ పమిడిముక్కల విజయ,
సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

ఆపరేషన్‌తో నయం చేయొచ్చు



మూర్ఛవ్యాధిని తగ్గించేందుకు మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. 30 శాతం మందికి ఎన్ని వాడినా తగ్గదు. వారికి ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. మందులు వాడితే పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.

– డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్,
న్యూరో సర్జన్, గుంటూరు

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



తెనాలి: శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానమైన వైకుంఠపురానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారంతో పాటు విశేషమైన భీష్మ ఏకాదశి కావడంతో ఉదయం నుంచే భారీగా చేరుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. స్వామి వారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో బారులు దీరారు. ఆలయం బయట వరకు క్యూలైన్లలో భక్తులు నిలబడ్డారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి వి.అనుపమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీష్మ ఏకాదశి విశిష్టతను అర్చకులు అశహరి రవికుమార్, సత్యనారాయణ గౌతమ్ భక్తులకు వివరించారు.

లక్ష్య సాధనకు క్రమశిక్షణ కీలకం



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందిస్తున్న కేఎస్ రవీంద్ర (బాబీ), రుబినా ఫ్రాన్సిస్ తదితరులు

- సినిమా డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కేఎస్ రవీంద్ర (బాబీ)
- విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన మహోత్సవ్-2కే25
- "వాయిస్ ఆఫ్ విజ్ఞాన్" మ్యాగజైన్ ఆవిష్కరణ

చేబ్రోలు: విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి క్రమశిక్షణ కీలకమని సినిమా డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కేఎస్ రవీంద్ర (బాబీ) అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ శనివారం ఘనంగా ముగిసింది. ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన వివిధ రాష్ట్రాల విద్యార్థులకు ట్రోఫీలను, రూ.15 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ఇష్టమైన రంగంలోకి వెళ్లి రాణించాలని విద్యార్థులకు సూచించారు. 2024 పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ.. జీవితంలో మొదటగా మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని పేర్కొన్నారు. పారాలింపిక్స్‌లో పతకం సాధించడానికి తల్లిదండ్రులు, కోచ్‌లు ఎంతగానో ప్రోత్సాహం అందించారని తెలిపారు. జీవితంలో ఎప్పుడూ ప్రయత్నాన్ని విరమించుకోవద్దని సూచించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 7వ స్థానంలో నిలిచినప్పుడు 6 నెలలపాటు తాను కుంగుబాటుకు గురైనట్లు తెలిపారు. విజ్ఞాన్ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ.. ఈ మహోత్సవ్ ద్వారా విద్యార్థులకు నూతన అనుభవం పొందే అవకాశం లభించిందన్నారు. వర్సిటీలో ప్రతిరోజు జరిగే కార్యక్రమాలు వంటి వాటిని విద్యార్థులకు అందజేయడమే లక్ష్యంగా రూపొందించిన "వాయిస్ ఆఫ్ విజ్ఞాన్" మ్యాగజైన్‌ను అతిథులు ఆవిష్కరించారు.

విజేతలు వీరే..

మొత్తం 80 ఈవెంట్లలో విజేతలకు బహుమతులతోపాటు ట్రోఫీలను అందించారు. క్రికెట్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతి సాధించింది. రన్నర్‌గా నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిలిచింది. మహిళల వాలీబాల్‌లో జీఈసీ కాలేజ్, ఎస్వీసీఈ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో కేఎల్‌యూ, మోహన్‌బాబు వర్సిటీ ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందాయి. కబడ్డీలో వీఎస్‌ఆర్ వీజేఐటీ, ఎస్వీసీలు తొలి, రెండో బహుమతులు గెలిచాయి. పలు రాష్ట్రాలకు చెందిన వందకుపైగా యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 50 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



రుబినా ఫ్రాన్సిస్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కుంభమేళాకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీస్



పట్నంబజారు : భక్తుల రద్దీ దృష్ట్యా కుంభమేళాకు అదనంగా స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు-2 డిపోకు సంబంధించి ఈనెల 11న ఒక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు అధికంగా రావడంతో ఈ నెల 15న మరో స్పెషల్ హైటెక్ పుష్‌బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గుంటూరు డిపో-2 నుంచి బస్సు బయలుదేరి 8 రోజులపాటు ప్రయాగ్ రాజ్ (కుంభమేళా) అయోధ్య, వారణాసి తదితర ప్రాంతాలకు వెళుతుందని తెలిపారు. పది కిలో మీటర్ల లోపు ఉన్న ప్రయాణికుల కోసం బస్సు పంపడం జరుగుతుందన్నారు. రూ. 8,300 ధర నిర్ణయించామని, వసతి, భోజన ఖర్చు ఎవరికి వారే వినియోగించుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 73828 97459, 73828 96403 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కేసుల విచారణలో వేగం పెంచాలి

జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ





సమావేశానికి హాజరైన డీఎస్పీలు, సీఐలు

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించి న్యాయస్థానాల్లో నెలకొన్న కేసుల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. కె.సుప్రజ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిందితుల ఆచూకీ తెలియకపోతే వారికి అనుబంధంగా ఉన్న వ్యక్తులను కోర్టుల్లో హాజరుపరచాలని చెప్పారు. హత్య, హత్యాయత్నం, ఎన్‌డీపీఎస్, పోక్సో, అత్యాచార కేసులకు సంబంధించి విచారణ ఆయా కోర్టుల్లో వెంటనే జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి చార్జిషీట్లను కోర్టుల్లో దాఖలు చేశాక పీఆర్‌సీ (ప్రిలిమినరీ రిజిస్ట్రేషన్ కేసు) నంబరు, ఎస్‌సీ (సెషన్స్ కేసు) నంబరు, సీసీ (కోర్టు కేసు) నంబరు సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా న్యాయస్థానాల్లో కేసుల చార్జ్‌షీట్ల దాఖలు, ఎన్‌బీడబ్ల్యూ జారీ, కేసుల విచారణకు అవసరమైన పత్రాల దాఖలుకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు అజీజ్ (తూర్పు), శివాజీరాజు (సీసీఎస్), భానూదయ (దక్షిణ), డీసీఆర్‌బీ సీఐ బి.నరసింహారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మనశ్శాంతిగా ఉండాలి

మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు



నగరంపాలెం: వ్యాసుడు వల్లే ప్రతి ఒక్కరూ మనశ్శాంతిగా ఉండాలని, వీలైనంత మౌనంగా ఉండాలని పద్మశ్రీ పురస్కారగ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. పట్టాభిపురం శ్రీరమా సత్యనారాయణస్వామి (48) బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో భారత యుద్ధంలో భగవంతుని పాత్రపై గరికపాటి నరసింహారావు ప్రవచనం చేశారు. అనవసరంగా మాట్లాడవద్దని, అత్యవసరమైతే మాట్లాడాలని తెలిపారు. ఏది అత్యవసరమైతే అది పని చేయాలని చెప్పారు. రహదారిపై ఒక లక్ష రూపాయాలు దొరికితే, దాన్ని రక్షణాధికారికి అందజేయాలని చెప్పారు. సదరు లక్ష రూపాయాలు రక్షణాధికారి ఏం చేస్తాడనేది అనవసరమని అన్నారు. కృత యుగంలో దొరికిన నగదు అప్పగించేవారని, కలియుగంలో ఆ పరిస్థితిలేదని తెలిపారు. ఓం నమో భగవతే నమః అంటూ నిద్ర వచ్చే వరకు, మరో ఆలోచన లేకుండా, ఇంకోకరితో మాట్లాడకుండా ఉన్నట్‌లైతే 24/7 భగవంతుడు మన వద్దనే ఉంటాడని అన్నారు.

ఇద్దరు ఘరానా దొంగలు అరెస్ట్?

- పోలీసులను బెదిరించేందుకు ఒకరు ఆత్మహత్యాయత్నం
- స్టేషన్ బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగడంతో ఆస్పత్రికి తరలింపు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో ఇటీవల కుంచనపల్లి, ఉండవల్లి సెంటర్లలో తాళాలు వేసిన ఇళ్లలో భారీ మొత్తంలో బంగారం, నగదు చోరీకి పాల్పడ్డ కేఎల్ రావు కాలనీ, సీతానగరానికి చెందిన ఇద్దరు యువకుల్ని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి నుంచి కొంత సొమ్ము రికవరీ చేశారు. మిగిలిన వాటి కోసం విచారణ చేస్తున్న క్రమంలో సీతానగరానికి చెందిన ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగిన ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... సీతానగరానికి చెందిన నాగరాజు, దుర్గారెడ్డిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కుంచనపల్లిలో జరిగిన దొంగతనంలో రికవరీ చేసే క్రమంలో దుర్గారెడ్డి పొరపాటున ఉండవల్లి సెంటర్‌లో కూడా తామే దొంగతనాలు చేశామని పోలీసుల వద్ద చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై నాగరాజును, దుర్గారెడ్డిని వేరువేరు చోట్ల ఉంచి ప్రశ్నించారు. నాగరాజు దొంగిలించిన వాటిని ఎక్కడ రికవరీ కింది ఇవ్వాల్సి వస్తుందోనని పోలీసులను బెదిరించేందుకు బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు అతడిని తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నెల రోజుల నుంచి ఫోన్ లొకేషన్ ద్వారా వేల ఫోను నెంబర్లను పరిశీలించి సుమారు రూ.75 లక్షల విలువైన బంగారాన్ని రికవరీ చేసే క్రమంలో ఈ ఘటన జరిగింది. దుర్గారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. అలాంటిది ఏమీ లేదంటూ సమాధానం దాటవేశారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందితులకు గంజాయి తాగే అలవాటు ఉందన్నారు. గంజాయి కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 4,600 గరిష్ఠం : రూ. 5,700

మోడల్ ధర రూ. 5,200

వాగులో పడి బీటెక్ విద్యార్థి మృతి



మారేడుమిల్లి: గుంటూరు జిల్లా అమరావతిలో గల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగులపాటి నాగ మల్లేశ్వరరావు(19) అనే విద్యార్థి వాగులో పడి శనివారం మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలోని పర్యాటక ప్రదేశమైన గుడిసె ప్రాంతాన్ని ఏడుగురు స్నేహితులతో కలిసి అతడు సందర్శించాడు. తిరుగు ప్రయాణంలో ఆకుమామిడికోట సమీపంలోని కాలకృత్యాల కోసం సంగువ వాగులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారి వాగులో పడి మునిగి మృతి చెందాడు. స్నేహితులు, ఆకుమామిడి కోట గ్రామస్తులు, వేజువాడకు చెందిన కొంత మంది గిరిజనులు కలిసి గాలింపు చర్యలు చేపట్టగా యువకుడి మృతదేహం లభ్యమైంది. దీనిపై మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సాదిక్ తెలిపారు.

233 దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గీత కులాలకు (గౌడ, గౌడ్‌లకు) రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులు కేటాయించేందుకు కొద్దిరోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణకు శనివారం చివరి రోజు కావడంతో 233 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధికంగా గుంటూరు నగరంలో ఒక్క షాపునకు 44 దరఖాస్తులు, తుళ్లూరు మండలంలో 43, తెనాలిలో 30 దరఖాస్తులు అందాయి. వీటికి సంబంధించి ఈ నెల 10వ తేదీన బ్రాడీపేటలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో లాటరీ తీసి షాపులు కేటాయించనున్నారు.

నేడు స్కాలర్‌షిప్పులు అందజేత



కొరిటెపాడు: 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు' 'ది రాజోల్ తాలూకా తెలగ అఫీషియల్ అసోసియేషన్ - రాజోలు' సంయుక్త ఆధ్వర్యంలో 242 మంది పేద విద్యార్థులకు రూ. 10.37 లక్షల ఉపకార వేతనాలుగా ఆదివారం పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ. 5.25 లక్షలు తులసి సీడ్స్ వారు 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ' ద్వారా 104 మందికి ఇవ్వనున్నారు. మంగేన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుంది. గౌరవ అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరు కానున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలిపారు.

రేపు నులిపురుగుల నిర్మూలన ట్యాబెట్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబెట్లు పంపిణీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల అసెంబ్లీలో చర్చించి, మధ్యాహ్న భోజనం తీసుకున్న తరువాత వైద్యాధికారులు, ఏఎన్ఎంల సమన్వయంతో అందజేయాలని సూచించారు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులకు తిరిగి ఈనెల 17న మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.